## క్లుప్తంగా

### విడవలూరులో జాబ్‌మేళా రేపు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): విడవలూరులోని పీఆర్‌ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత ఆదివారం తెలిపారు. ఈ జాబ్‌మేళాను జవహర్ నాలెడ్జ్ సెంటర్, లలితా జ్యూయలరీ మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌వారు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, షోరూం మేనేజర్, ఫ్లోర్ మేనేజర్, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్, అకౌంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి గల వారు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఇతర ధ్రువీకరణ పత్రాలతో జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9133848444 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

### పేదలకు దుస్తుల పంపిణీ



మనుబోలు: పీపుల్స్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని కొలనకుదురు గ్రామంలో ఆదివారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. సర్పంచ్ తూపిలి వెంకటరమణయ్య చేతులమీదుగా గిరిజన కుటుంబాలకు దుస్తులు అందజేశారు. వృద్ధులు, వితంతువులు 25 మంది, 30 మంది చిన్నారులకు దుస్తులు అందజేసినట్లు ట్రస్ట్ నిర్వాహకుడు పోతుగుంట మల్లికార్జునరావు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటరమణమ్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

### పూడిపర్తిలో రక్తదాన శిబిరం



వెంకటాచలం: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని పూడిపర్తి గ్రామంలో శివాజీ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 104 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శివాజీ యూత్ ఫౌండేషన్ చైర్మన్ మోపూరు భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని తెలిపారు. ప్రజల్లో రక్తదానంపై ఉన్న అపోహలు తొలగిపోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీఐ గంగాధర్‌రావు, సర్పంచ్ దక్కలి శ్రావణి, ఎంపీటీసీ సభ్యులు రఘునాథరెడ్డి, హరి, సాయికిరణ్, శరత్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### వేళాంగిణి చర్చిలో ప్రార్థనలు

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు వద్ద ఉన్న వేళాంగిణి చర్చిలో ఆదివారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వేళాంగిణి చర్చి డైరెక్టర్, ఫాదర్ లోకేష్‌రాజ్ దైవసందేశం వినిపించారు. చర్చిలో జరిగిన ప్రార్థనలకు జిల్లా నలువైపుల నుంచి భక్తులు విచ్చేశారు.

### వాహనాల తనిఖీ



ఇందుకూరుపేట: కోవూరు సీఐ కె.రామకృష్ణారెడ్డి మండలంలోని నరసాపురం, మైపాడులలో ఆదివారం ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాల తనిఖీ చేపట్టి సరైన పత్రాలు, లైసెన్సులు లేని వాహనదారులకు జరిమానా విధించారు. 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్సై సీహెచ్ వాసు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరానికి స్పందన

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక వివేకానంద పాఠశాలలో ఆదివారం బాలా హార్ట్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్యులు బాలకృష్ణ మాలేపాటి మాట్లాడుతూ ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేసిన పేదలకు వైద్యసలహాలతోపాటు మందులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ శిబిరంలో బుచ్చిరెడ్డిపాళెం, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన దాదాపు 450 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. బీపీ, షుగర్ పరీక్షలతోపాటు అవసరమైన వారికి ఈసీజీ కూడా తీశామన్నారు. వైద్యులు బాలిరెడ్డి, హారిక, వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణిరెడ్డి పాల్గొన్నారు.

# పీఎంపీలు అవగాహన కల్పించాలి




మాట్లాడుతున్న కవితా కిరణ్

నెల్లూరు(అర్బన్): మహిళల ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు గానూ గ్రామీణ స్థాయిలో పీఎంపీలు అవగాహన కల్పించాలని డాక్టర్ కవితా కిరణ్ పేర్కొన్నారు. మహిళల ఆరోగ్యం, ఆధునిక వైద్యం, సంతాన సాఫల్యం, తదితర అంశాలపై పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సభ్యులకు అవగాహన సదస్సును పొగతోటలోని సాయికిరణ్ మెటర్నిటీ ఫెర్టిలిటీ హాస్పిటల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఒత్తిడి, నిద్రలేమి, తదితర కారణాలతో సంతాన సమస్యలు ఎక్కువవుతున్నాయని చెప్పారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను నిర్వహించి బుక్‌లెట్లను ఆవిష్కరించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ రాణి, ఎంబ్రియాలజిస్ట్ రామాంజనేయులు, పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, సత్తార్, నేతలు ప్రసాద్, శ్రీనివాసులు, రామదాస్, రమణయ్య, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆలనాపాలన కరువు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఐల్యాండ్ ఆలనాపాలనను అధికారులు విస్మరించారు. వెంకటేశ్వరపురం సెంటర్‌లోని ఫ్లయ్‌ఓవర్ కింద 2016లో మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ కాంస్య విగ్రహాన్ని రూ.పది లక్షలతో ఏర్పాటు చేశారు. విగ్రహం చుట్టూ మరో రూ.10 లక్షలతో ఐల్యాండ్‌నూ నిర్మించారు. ప్రస్తుతం ఈ ఐల్యాండ్‌లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో పాటు ద్వారం గేట్ ఊడిపోయింది. అంసాఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. సంబంధిత అధికారులు ఈ విషయంలో దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలను ఆరాతీస్తున్న గౌరి

నెల్లూరు రూరల్: డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని 21వ డివిజన్ కార్పొరేటర్ గౌరి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని మాగుంట లేఅవుట్లో గల పలు ప్రాంతాల్లో ఆదివారం ఆమె పర్యటించారు. వివిధ సమస్యలను స్థానికులు తెలియజేశారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కుక్కలు, పందుల స్వైర విహారం





నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53, 54వ డివిజన్ల పరిధిలో గల వెంకటేశ్వరపురం, పోస్టాఫీస్ వీధి, నల్ల కాలువ, జనార్దన్‌రెడ్డి కాలనీ, గాంధీగిరిజనకాలనీ, ఇస్లాంపేట ప్రాంతాల్లో కుక్కలు, పందుల స్వైర విహారం నానాటికీ అధికమవుతోంది. వీటి కారణంగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కుక్కల దాడిలో పలువురు గాయపడ్డారు. మరోవైపు పందుల స్వైర విహారంతో దుర్గంధం వెదజల్లుతూ ఇక్కట్లు ఎదురవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

# పోలీసుల అదుపులో నిందితులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఉడ్‌హౌస్‌సంఘంలో శుక్రవారం జరిగిన హత్య కేసులో ఇద్దర్ని నవాబుపేట పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారని సమాచారం. పాత గొడవల నేపథ్యంలో మహేష్ హత్య జరిగిందనే నిర్ధారణకు పోలీసులు వచ్చారు. హత్య కేసులో ప్రధాన నిందితుడిగా అనుమానిస్తున్న సుజన్‌కృష్ణారెడ్డి అలియాజ్ చింటూ ఆచూకీ తెలియకపోవడంతో గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. కాగా మిగిలిన నిందితులను రెండు రోజుల్లో అదుపులోకి తీసుకొనే అవకాశం ఉంది.

# సీనియర్ న్యాయవాది మృతి



జగదీశ్వర్ (ఫైల్)

నెల్లూరు(లీగల్): సీనియర్ న్యాయవాది, బీజేపీ లీగల్ సెల్ నేత జగదీశ్వర్ (58) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. ఆయన మృతికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, మాజీ ప్రధాన కార్యదర్శి రోజారెడ్డి, బీజేపీ లీగల్ సెల్ నేత రాజేంద్రప్రసాద్ సంతాపం తెలియజేశారు.

# నేత్రదానం



వెంకటలక్ష్మమ్మ (ఫైల్)

నెల్లూరు(అర్బన్): నగరంలోని పెద్దబజార్‌కు చెందిన వెంకటలక్ష్మమ్మ (70) ఆదివారం మృతి చెందారు. కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్రదాన మోటివేటర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం ఆమె కుటుంబసభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99481 64781, 93471 11033 నంబర్లను సంప్రదించాలని సూచించారు. నేత్రదాన మోటివేటర్ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎన్టీఆర్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల ఎన్టీఆర్‌నగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సోమవారం ఉండదని స్టోన్‌హౌస్‌పేట ఏఈ సుకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సరస్వతీనగర్, మోడరన్ స్కూల్, రాయపుపాళెం, బాబూజగ్జీవన్ గిరిజన కాలనీ, ఏసీనగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

### గ్రామదేవత జాతరకు రాజకీయాలు తగవు

నెల్లూరు(బృందావనం): సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి జాతరకు రాజకీయాలు తగవని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. అమ్మవారికి పూజలను ఆదివారం నిర్వహించి విశేష ద్రవ్యాలను సమర్పించారు.

### డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తా

నెల్లూరు(సెంట్రల్): రూరల్ పరిధిలోని 28వ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మదన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్లోని చైతన్యపురి కాలనీలో స్థానిక నేతలతో కలిసి ఆదివారం పర్యటించారు.

### పోక్సో కేసు నమోదు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వ్యక్తిపై పోక్సో కేసును వేదాయపాళెం పోలీసులు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. బీవీనగర్‌కు చెందిన ఓ బాలిక నగరంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. అదే కళాశాలలో డిగ్రీ చదువుతున్న పడారుపల్లి ప్రాంతానికి చెందిన వెంకటేష్ అలియాస్ వెంకీ ప్రేమిస్తున్నానని చెప్పి బాలికను ఈ నెల 20న తన వెంట తీసుకెళ్లాడు. అనంతరం నగరంలో బాలికను వదిలి పరారయ్యాడు. దీంతో విషయాన్ని కుటుంబసభ్యులకు బాలిక తెలియజేశారు. దీనిపై వేదాయపాళెం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గతంలో నమోదైన మిస్సింగ్ కేసును పోక్సో కేసుగా మార్పు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సేవా కార్యక్రమాలను చేపట్టాలి



బుచ్చిరెడ్డిపాళెం: అనాథలకు, పేదలకు, వృద్ధుల కోసం సేవా కార్యక్రమాలు చేపట్టాలని రేబాల సర్పంచ్ లగుంతోటి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని రేబాలలో ఉన్న వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సేవా సంఘం సభ్యులు పాశం కుమారి, గుమ్మడి స్వరాజ్యం, చేజర్ల అచ్యుత, చేజర్ల మౌనిక, ఎల్లంటి మహిత, భవిత కేంద్రం ఉపాధ్యాయులు శేషమ్మ, శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మస్తానయ్య పాల్గొన్నారు.

### గ్రిగ్స్ క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పొదలకూరు: మండలంలోని మహ్మదాపురం డీఏస్సార్ జెడ్పీ హైస్కూల్లో సర్వేపల్లి జోన్ పరిధిలో నిర్వహించిన గ్రిగ్స్ మెమోరియల్ క్రీడా పోటీల్లో అమ్మవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొత్తం 8 పతకాలను సాధించి సత్తాచాటారు. బాలికల విభాగంలో కబడ్డీ, త్రోబాల్‌లో ప్రథమస్థానం, టెన్నికాయిట్‌లో ద్వితీయస్థానం సాధించారు. బాలుర విభాగంలో సాఫ్ట్‌బాల్, ఫుట్‌బాల్, హాకీ పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచారు. జూనియర్ బాలుర విభాగంలో ఫుట్‌బాల్ ద్వితీయస్థానం సాధించినట్లు పాఠశాల పీడీ సురేంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో హెచ్‌ఎం విజయకుమార్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాషిణి, వెంకటరెడ్డి, శ్రీహరిరెడ్డి, గౌస్, రామరాఘవయ్య పాల్గొన్నారు.

### కోడూరు బీచ్‌లో సందడి



తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు బీచ్‌లో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. సాధారణంగా సెలవు, పండగ రోజుల్లో సరదాగా గడిపేందుకు జిల్లా నలువైపుల నుంచి కోడూరు బీచ్‌కు పర్యాటకులు విచ్చేస్తుంటారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి రావడంతో కోడూరు బీచ్ సందడిగా మారింది. కుటుంబ సమేతంగా విచ్చేసిన సందర్శకులు బీచ్‌లో సేదతీరారు. అలాగే స్నేహితులతో కలిసి వచ్చిన యువతీ యువకులు గంటల కొద్ది సముద్రస్నానాలు చేస్తూ సంతోషంగా గడిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శకులు బీచ్‌లో సందడి చేశారు.

### వసతిగృహాల్లో తనిఖీలు

ఆత్మకూరు: పట్టణంలోని జేఆర్‌పేట, ఎల్‌ఆర్‌పల్లిలోని బీసీ సంక్షేమ బాలబాలికల వసతి గృహాలను జిల్లా బీసీ సంక్షేమ అధికారి వై వెంకటయ్య ఆదివారం తనిఖీ చేశారు. వసతి గృహాల పరిసరాలు, వంట గదులు, భోజనశాలలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఓ విద్యార్థి చేసిన ఫిర్యాదుపై స్పందించి వసతిగృహ సిబ్బందిని మందలించారు. విద్యార్థులతో ప్రేమగా వ్యవహరించాలని సూచించారు.

# రోటరీ క్లబ్ సేవలను విస్తరిస్తాం



నెల్లూరు రూరల్: రోటరీ క్లబ్‌ల ద్వారా సేవలను విస్తరించనున్నామని క్లబ్ జిల్లా గవర్నర్ సతీష్ పేర్కొన్నారు. కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సేవా కార్యక్రమాలతో సమాజంలో గుర్తింపు ఉంటుందని చెప్పారు. సేవా కార్యక్రమాలకు దాతలు సమకూర్చే నిధులను సద్వినియోగం చేసుకోవడం రోటరీ క్లబ్‌ల బాధ్యత అని తెలిపారు.

## నూర్‌బాషాలకు రాజకీయంగా ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న సలీమ్

నెల్లూరు(వేదాయపాళెం): రాష్ట్ర జనాభాలో 20 లక్షల మందికిపైగా ఉన్న నూర్‌బాషాలకు రాజకీయంగా ప్రాధాన్యమివ్వాలని నూర్‌బాషా సంఘ జిల్లా అధ్యక్షుడు సలీమ్ కోరారు. శాంతినగర్‌లోని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సంఘ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ వర్గానికి చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించలేదని, ఈ క్రమంలో చైతన్య యాత్రను చేపట్టనున్నామని వివరించారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖాదర్‌బాషా, బాబర్, హుస్సేన్ సాహెబ్, మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా సైన్స్ ఎక్స్‌పో



నెల్లూరు(వేదాయపాళెం): వేదాయపాళెంలోని సాయి మహావిద్యాలయ పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పోను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ నరసింహారావు, సింహపురి ప్రజావైద్యశాల అధినేత డాక్టర్ దయాకర్ మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై ఆసక్తిని కల్పించాలని కోరారు. అనంతరం పలు నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు.

ఉత్తమ నమూనాలను ప్రదర్శించిన వారికి బహుమతులను అందజేశారు. కరస్పాండెంట్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్‌ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు ఎస్‌ఈబీ - 1 ఇన్‌స్పెక్టర్ కిషోర్ వివరాల మేరకు.. అల్లీపురం, మూడో మైలు వద్ద ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో ఎస్‌ఈబీ నెల్లూరు - 1 అధికారులు తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలను చేపట్టారు. ఈ క్రమంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్లతో పాటు డ్రైవర్లు పూర్ణచంద్ర, సురేందర్‌ను అదుపులోకి తీసుకొని తదుపరి విచారణ నిమిత్తం నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# నమ్మించి మోసం చేశారని ఫిర్యాదు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తనను నమ్మించి మోసం చేసి గర్భస్రావం చేయించిన వ్యక్తిపై చర్యలు చేపట్టాలని దిశ పోలీస్‌స్టేషన్లో ఓ యువతి ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఇందుకూరుపేట మండలంలోని కొరుటూరుకు చెందిన ఓ యువతిని అదే గ్రామానికి చెందిన శ్రీహరి ప్రేమిస్తున్నానని నమ్మించారు. గర్భం దాల్చాక బలవంతంగా మాత్రలు ఇచ్చి గర్భస్రావం చేయించారు. వివాహం చేసుకునేందుకు నిరాకరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై కృష్ణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడుపుతున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఎస్పీ విజయారావు ఆదేశాల మేరకు నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్‌ను ఆదివారం నిర్వహించారు. లైసెన్సుల్లేకుండా, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఆర్ఎస్సైలు తిరుమలరెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఒంటరితనం, ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భగత్‌సింగ్‌కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాళహస్తికి చెందిన సావిత్రి (28) భర్త, పిల్లలతో విడిపోయి నగరంలోని భగత్‌సింగ్‌కాలనీలో గల తన సోదరి ఉంటున్న టిట్కో అపార్ట్‌మెంట్‌కు తొమ్మిది నెలల క్రితం వచ్చారు. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు, ఒంటరితనంతో బాధపడుతూ ఇంటి తలుపులను మూసి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ఘటన స్థలానికి చేరుకొని తలుపులను పగలగొట్టి మృతదేహాన్ని కిందికి దించారు. మృతురాలి సోదరి ప్రభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

నెల్లూరు(అర్బన్): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణను ప్రకటించామని సంఘ జిల్లా చైర్మన్ పెంచలరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి తొమ్మిది నుంచి నిర్వహించనున్న ఆందోళనల్లో ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

### బైక్ చోరీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బైక్ చోరీకి గురైన ఘటనపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. సరస్వతీనగర్‌కు చెందిన రమేష్ తన బైక్‌ను ఇంటి బయట ఈ నెల ఏడో తేదీ నిలిపారు. మరుసటి రోజు ఉదయానికి అదృశ్యమవ్వడంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.